క్లుప్తంగా

మట్కా బీటర్లు అరెస్టు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మట్కా ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీర పునాయినిపల్లి మండలం ఇందుకూరు గ్రామానికి చెందిన నాదెండ్ల చిన్నగుర్రప్ప, మాధవ, రఘునాథయ్యలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ

కమలాపురం: హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమలాపురం యువతకు ఉచితంగా డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీదుర్గ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్‌లో 20 రోజులు డ్రైవింగ్‌లో శిక్షణతో పాటు మరో 10రోజుల థియరీ క్లాసులు చెబుతారని ఆయన అందులో పేర్కొన్నారు. అనంతరం ఎల్ఎల్ఆర్ లైసెన్స్, సర్టిఫికెట్స్ ఇప్పిస్తామన్నారు. 19–35 సంవత్సరాల్లోపు ఉన్న యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఆధార్, రేషన్‌కార్డు, మార్క్‌లిస్ట్, 4 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 అభయ ఫౌండేషన్ పేరిట చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, శిక్షణ అనంతరం రూ.500 తిరిగి చెల్లిస్తారని ఆయన అన్నారు.

తైక్వాండో పోటీలలో ఎర్రగుంట్ల విద్యార్థుల ప్రతిభ



తైక్వాండోలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : ఈ నెల 11,12 తేదీలలో తిరుపతిలో జరిగిన తైక్వాండో పోటీలలో ఓపెన్ సౌత్ తైక్వోండో చాంపియన్ షిప్‌లో ఎర్రగుంట్లకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచారని తైక్వాండో కోచ్‌లు దినేష్, సుమన్‌బాబులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తైక్వోండో ఆటకు సంబంధించి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ ఆటలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులైన ఎస్ సాహిల్ , ఈ అభిలాష్, డి సుజయ్‌షాలోమ్‌లు బంగారు పతకాలు, ఎస్ సోహెల్ టీ హవీష్, ఎస్ యాఘనాహిత్‌రెడ్డి, ఎస్ తఫాజుల్, ఏ ఆనంతిక వెండి పతకాలు సాధించారన్నారు.

భూసార పరీక్షలకనుగుణంగా ఎరువులు వాడాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ రాజేంద్ర ప్రసాద్, తదితరులు

వేంపల్లె : రైతులు పంటలను సాగు చేసే ముందు భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామంలో రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన వరి పంటకు భూసార పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువుల యాజమాన్యం చేపట్టాలని రైతులకు సూచించారు. మోతాదుకు మించి ఎరువులను వాడితే పంట ఎదుగుదల తగ్గి దిగుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

కల్వర్టు ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు: ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారిలో ఉన్న దేవగుడి బ్రాంచ్ కెనాల్‌పై కల్వర్టును ఏర్పాటు చేయించాలంటూ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ కడప స్పందనలో ఫిర్యాదు చేశారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో జరిగే స్పందనలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏడీ శేషగిరిబాబు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో 30 కుటుంబాల గృహాలకు కొన్ని రోజులుగా విద్యుత్తు సరఫరా లేక అంధకారంలో ఉన్నామని సోమవారం గ్రామస్తులు విద్యుత్తు శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. గ్రామంలో విద్యుత్తు స్తంభం పడిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు కొత్త స్తంభం ఏర్పాటు చేయలేదని వాపోయారు. రాత్రి వేళ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందారు. విద్యుత్తు శాఖ ఏడీ శేషగిరిబాబుకు వినతి పత్రం అందజేశారు. మూడు రోజుల్లో కొత్త విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వైభవంగా రథయాత్ర

వేంపల్లె : చక్రాయపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీరాచరాయలస్వామివార్ల రథయాత్ర వైభవంగా సాగుతోంది. సోమవారం వేంపల్లె పట్టణంలోని గాజులపేటలో స్వామివారి రథయాత్ర సందర్భంగా ఆలయ చైర్మన్ ఓబుళరెడ్డి, కమిటీ సభ్యులు చక్రపాణిరెడ్డి, రామాంజనేయరెడ్డిలు మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన ప్రారంభమైన ఈ రథయాత్ర చక్రాయపేట మండలం పూర్తి చేసుకుని వేంపల్లె మండలం ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె, కుమ్మరాంపల్లె మీదుగా వేంపల్లె పట్టణానికి చేరుకుందన్నారు. ఈనెల 18వ తేదీ వరకు ఆయా గ్రామాల మీదుగా రథయాత్ర సాగుతుందని.. భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ హరినాథరెడ్డి, కమిటీ సభ్యులు రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీరామ్మూర్తి, ఈశ్వరయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



రథయాత్రకు బిందెతో నీళ్లు చల్లుతూ స్వాగతం పలుకుతున్న మహిళా భక్తురాలు

హంస వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో ప్రాచీన దేవాలయమైన శ్రీరంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 9వరోజు సోమవారం రాత్రి శ్రీరంగనాథ స్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. స్వామి వారికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నాటితో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కెవి రమణలు, సభ్యులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన



కుష్టు వ్యాధి గురించి అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యం

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటరత్నమ్మ మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదరించి వారిలో ధైర్యాన్ని నింపి చికిత్స అందించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమారి, ఎస్.అరుణ, మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండూరు : కుష్టు వ్యాధిని మొదట్లోనే గుర్తిస్తే అంగ వైకల్యాన్ని నివారించవచ్చునని ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం సంతకొవ్వూరు పీహెచ్‌సీ పరిధిలోని గోటూరు గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా డాక్టర్ ముంతాజ్, గ్రామ సర్పంచ్ పావని ల ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ కుష్టు వ్యాధి ఏవిధంగా వ్యాపిస్తుంది, కుష్టు వ్యాధి లక్షణాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, పీహెచ్ఎస్ సుభద్రమ్మ, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ సీహెచ్ఓ శ్రీలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



మాట్లాడుతున్న బిషప్

జమ్మలమడుగు: పట్టణంలోని ఎస్పీజీ క్వార్టర్స్‌లో ఉన్న సీఎస్ఐ చర్చి 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం రాయలసీమ డయాసిస్ బిషప్ ఐజాక్ వర ప్రసాద్, భారతీలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా బిషప్ మాట్లాడుతూ శాంతి, సమాధానాం , సాటి మనుష్యులకు సహాయంతో పాటు, ప్రేమను అందించాలన్నారు. ఇదే ప్రభువైన యేసు క్రీస్తు మనకు పరిశుద్ధ బైబిల్ గ్రంథం ద్వారా తెలియజేస్తున్నారన్నారు. అనంతరం సంఘ సభ్యులు బిషప్ వరప్రసాద్ దంపతులకు సన్మానించారు.

భక్తి శ్రద్ధలతో గాయత్రి యజ్ఞం



యజ్ఞాలు చేయిస్తున్న గురురాజారావు

కమలాపురం: స్థానిక స్వామి వివేకానంద హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ పంచముఖి గాయత్రి యజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గాయత్రి పరివార్–ఋుషికేష్ వారి ఆధ్వర్యంలో గురురాజారావు, నాగపాటి రాజాగురూజీ పర్యవేక్షణలో పంచముఖ గాయత్రి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు చేశారు. ప్రపంచ శాంతి కోసం ఈ యజ్ఞం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రక్తహీనత నివారించడమే ప్రభుత్వాల లక్ష్యం

కమలాపురం: గర్భవతులు, బాలింతల్లో రక్తహీనతను నివారించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అని నీతి అయోగ్ పరమల్ ఫౌండేషన్ పరిశీలకుడు వెంకటేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కమలాపురం పట్టణంలోని 14వ వార్డు 4వ, 3వ అంగన్వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న రికార్డులను, హాజరు పట్టికలను, గర్భవతులు, బాలింతల వివరాలను పరిశీలించారు. అలాగే సెంటర్‌కు వచ్చిన గర్భవతులు, బాలింతలతో వారికి అందుతున్న పౌష్టికాహారం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ పై ఆరా తీశారు. అలాగే రోజు మధ్యాహ్నం సెంటర్లలోనే భోజనం తింటున్నారా? రుచికరంగా ఉందా? అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు కోడి గుడ్డు, పాలు ఇస్తున్నారా? అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల పనితీరు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నప్పటికి వారిలో రక్తహీనత చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. రక్తహీనత పై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్నారుల అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు మూల స్తంభాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మేరీ జయకుమారి, పార్వతి, వర్కర్లు సునీత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న పరిశీలకుడు వెంకటేష్

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించండి



పులివెందుల అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక భాకరాపురంలోని పాడా కార్యాలయంలో ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల మోడల్ టౌన్‌పై దృష్టి పెట్టడం జరిగిందన్నారు. అందువల్ల అధికారులు దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. వైఎస్సార్ క్రికెట్ స్టేడియం, సిటీ సెంటర్, నగర వనం, నైపుణ్యాభివృద్ధి సంస్థ పనులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో ముస్లింలకు పెద్దపీట



జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న ముస్లిం సోదరులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

వేంపల్లె : వైఎస్సార్‌సీపీలో ముస్లింలకు పెద్ద పీట వేశారని మాజీ జెడ్పీటీసీ షబ్బీర్‌వలి, హజ్ హౌస్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మునీర్, షాదీఖానా కమిటీ చైర్మన్ షేక్షావలిలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులను ముస్లింలు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వైఎస్ అప్పట్లో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించాలని గుర్తు చేశారు. కాగా రోడ్డు విస్తరణలో భాగంగా వేంపల్లె పట్టణంలో ఉన్న మర్కస్ మసీదుకు సంబంధించి వాణిజ్య గదులకు భారీ మొత్తంలో నష్టపరిహారం ఇచ్చినందుకు కృషి చేసిన జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులుకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, మసీదు కమిటీ చైర్మన్ ఆఫిజ్, రఫి, మహమ్మద్ గౌస్, టైల్స్ మౌలా, చాన్ బాషా, మాజీ కో.ప్షన్ సభ్యులు సాదక్‌వల్లిలతోపాటు పలువురు మైనార్టీ నాయకులు, మసీదు ఇమాములు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ప్రాంతాన్ని పరిశీలించిన డీఎస్పీ



ఎస్‌సీఎస్ఆర్ కళ్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, తదితరులు

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 15వ తేదీన జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులకు రానున్నారు. పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి కుమారుని వివాహ రిసెప్షన్ వేడుకలలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు కదిరి రోడ్డులోని ఎస్‌సీఎస్ఆర్ కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ రాజు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కల్యాణం... కమనీయం

కడప కల్చరల్ : కడప నగరం సాయిపేటలోని శ్రీ భద్రావతి భావనా రుషి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు టి.మధుశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మాఘ బహుళ సప్తమి స్వాతి నక్షత్రంలో కల్యాణోత్సవాన్ని కమనీయంగా చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతం, అభిషేకం, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. దీక్షా హోమాలు, మహా పూర్ణాహుతి చేసి నంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చాటనలు, మంగళ వాయిద్యాలు, భక్తుల నామస్మరణల మధ్య కల్యాణ ఘట్టాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా కోలాహలంగా నిర్వహించారు.





కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు
(ఇన్‌సెట్) కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

పందులను గ్రామాలకు దూరంగా తరలించాలి

చెన్నూరు : చెన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పందులను గ్రామాలకు దూరంగా తరలించకపోతే వాటి యజమానులపై కఠిన చర్యలు తప్పవని సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఎంపీటీసీ ముదిరెడ్డి సుబ్బారెడ్డిలు హెచ్చరించారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ పందులను వాటి యజమానులు గ్రామాలలో వదలడంతో అవి ఇళ్లల్లో, వీధుల్లో తిరగడం, ఇళ్లలో పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయన్నారు. ఈ కారణంగా ప్రజలు వివిధ వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళనతో గ్రామ పంచాయతీకి అనేకమార్లు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా పొలాలలో రైతులకు సంబంధించిన పంటలను ధ్వంసం చేస్తున్నాయని అటు రైతులు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. రెండు,మూడు రోజులలో పందులను ఊరికి దూరంగా తరలించకపోతే ఉపేక్షించేది లేదని పందుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు కొండపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

చెన్నూరు : ఈనెల 15వ తేదీ కొండపేటలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రముఖులు పెడబల్లె సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. దివంగత పెడబల్లి సుబ్బారెడ్డి, పెడబల్లె శివారెడ్డిల సంస్మరణగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు అమర్నాథరెడ్డి, శ్రావణి తదితరులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి పుష్పగిరి కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని ఆయన వివరించారు.

క్రమశిక్షణతో మెలగాలి

చింతకొమ్మదిన్నె: మండలంలోని గ్రామాల్లోని ప్రజలు క్రమ శిక్షణతో మెలగాలని సికెదిన్నె ఎస్ఐ బి. అరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలో అల్లర్లు సృష్టిస్తున్న వ్యక్తులకు పరివర్తన కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు సలహాలు ఇస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు

మైలవరం (జమ్మలమడుగు రూరల్): 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని గణిత శాస్త్ర నిపుణుడు బైరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మైలవరం మండలంలోని దొమ్మర నంద్యాల బి.సి బాలుర హాస్టల్‌లో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె. కృష్ణయ్య అధ్యక్షతన విద్యార్థులకు శిక్షణ, ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సబ్జెక్ట్ నిపుణులు సూచనలు, సలహాలు అందించారు. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఏ సమస్యా ఉండదని ఆయన తెలిపారు. కష్టమైన సబ్జెక్టులను ఇష్టంగా చదవాలని ఆయన సూచించారు. మెరుగైన మార్కులు తెచ్చుకుని ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించాలని ఆయన తెలిపారు. నెల రోజులు కష్టపడితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు అందె వెంకటరెడ్డి, సుజాత, ఉపాధ్యాయులు భరత్ కుమార్, శివారెడ్డి పుల్లయ్య, రవి కిషోర్, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

సింహాద్రిపురం : సింహాద్రిపురంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో వైఎస్ రాజారెడ్డి జూనియర్ కళాశాల సమీపంలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. గతంలో నిడివెల్ల సమీపంలో గల హిమకుంట్ల రోడ్డులో జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందని.. అయితే ఆ ప్రదేశం అనుకూలంగా లేకపోవడంతో కళాశాల సమీపంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే మట్టి రోడ్డు, విద్యుత్ సౌకర్యంతోపాటు ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం



విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

ఎర్రగుంట్ల : ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని ఎర్రగుంట్ల పిహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టరు నాగార్జున, డాక్టరు జ్యోత్స్న తెలిపారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని పీహెచ్‌సి సిబ్బందితో కలసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సోమ, గురు వారాల్లో ఐరన్ మాత్రలు వాడుతున్నారా లేదా అని ఆరా తీశారు. పోషక పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే మహిళలలో ఆరోగ్య సమస్యలన్నింటికి పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఓబులేసు, లక్ష్మిదేవి, పిహెచ్ఎన్ వరదమ్మ, జయపాల్, రాజీ పాల్గొన్నారు.